## పేదలకు వరం 'సీఎం సహాయనిధి'

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి




బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, మే 26 : పేదలకు సీఎం సహాయనిధి పథకం వరం లాంటిదని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ధరూర్ మండల కేంద్రానికి చెందిన జానకమ్మకు మెరుగైన వైద్య చికిత్స కోసం మంజూరైన రూ.75వేల ఎల్‌వోసీని బాధితకుటుంబ సభ్యులకు ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహాయంతో ప్రజలు మెరుగైన వైద్యం చేయించుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబురామన్ గౌడ్ పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

- రైతుబీమా, ఇన్సూరెన్స్ ద్వారా రూ. 7లక్షల సాయం
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



బాధిత కుటుంబానికి రూ. 2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, మే 26 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యేఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో రైతుబీమా, పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా కుటుంబానికి రూ. 7లక్షల సాయం అందించి ఆదుకున్నదని వివరించారు. ఆదివారం కొత్తకోట మండలంలోని ఈదులబాయి తండాలో నేరుగా కార్యకర్త శంకర్‌నాయక్ ఇంటికి వెళ్లి రూ.2లక్షల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబీమా ద్వారా రూ. 5లక్షల నగదును నెలరోజులోనే బాధితుడి భార్య లక్ష్మి ఖాతాలో జమ చేశామని తెలిపారు. కేసీఆర్ ముందు చూపుతోనే పేదలకు కష్ట కాలంలో అండగా నిలిచారని తెలిపారు. ఈదులబాయి తండాకు చెందిన శంకర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. వారికి అండగా రైతు బీమాతో పాటు పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక, ప్రశాంత్, విశ్వేశ్వర్, గుంతమల్లేశ్, లక్ష్మణ్‌నాయక్, గోపాల్‌నాయక్, పరమేశ్, తిరుపతయ్య, లాలు పాల్గొన్నారు.

### బాధితుడికి పరామర్శ

కొత్తకోట, మే 26 : కొత్తకోట పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త షకీల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం షకీల్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంతమౌనిక, విశ్వేశ్వర్, సాధిక్, వసీం ఉన్నారు.

## దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు



దవాజీపల్లిలో దుక్కులు సిద్ధం చేసిన దృశ్యం

పాన్‌గల్, మే 25: ఈఏడాది మోస్తరుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఉత్సాహంగా వానకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. మండలంలో ప్రధానంగా సాగుచేసే జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర్లు తదితర ఆరుతడి పంటలకోసం రైతులు ముమ్మురంగా వేసవి దుక్కులు సిద్ధం చేస్తున్నారు. భూమి దున్నడానికి అనువైన సమయం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ట్రాక్టర్లు, ఎడ్లతో గొర్రు దున్నే పనులు చేపడుతున్నారు. శనివారం రోహిణి కార్తె ప్రారంభమవుతుండడంతో ఈ కార్తెలో విత్తనాలు వేస్తే పంటలకు ఎలాంటి చీడపీడలు రాకుండా పంట దిగుబడి ఎక్కువ వస్తుందని రైతుల నమ్మకం.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

మదనాపురం, మే 26 : ప్రతిఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి అన్నారు. మండలంలోని దుప్పల్లి ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదిగినప్పుడు తమకు కలిగే ఆనందం వెలకట్టలేదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్, మాణిక్యప్రభు, బస్వరాజ్, హుస్సేన్, ఖాజన్ గౌడ్, కృష్ణయ్య, నిస్సార్, నిర్మల, సరిత, రాధిక, విద్యార్థులు విద్యార్థినులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE
★Mahaboobnagar, Kamala Nehru Cly. Bayamma Thota, Indp. House 372 Yds. House No. 1-4-130/4/A9, E/F, 2000 Sft. Ph: 9949918256, 9440295825.
NT-327835

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

# సేంద్రియంతో 'సాగు'దాం

- జిల్లాకు వెయ్యి క్వింటాళ్లు
- రాయితీపై జీలుగ విత్తనాలు



జీలుగ పంట

వనపర్తి, మే 26 : అధిక దిగుబడులే లక్ష్యంగా కొందరు రైతులు పంటలకు ఎక్కువశాతం రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఫలితంగా భూసారం దెబ్బతినడమే కాకుండా ఆహార పంటలు కలుషితమవుతున్నాయి. క్రమంగా పంటల్లో సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తున్నాయి. అంతే కాదు చీడపీడల ఉధృతి పెరగడంతో రైతులపై భారం పడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పచ్చిరొట్ట ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది. వ్యవసాయశాఖ రాయితీపై విత్తనాలను సరఫరా చేస్తుంది.జీలుగ, జనుము వంటివి సాగు చేసుకొని పచ్చిరొట్టగా మార్చుకుని పొలాన్ని సారవంతం చేసుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో 5.65లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. రసాయనిక ఎరువులతో తాత్కాలిక ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని కర్షకులు గుర్తించాలి. భూసారాన్ని కాపాడుకొని అధిక దిగుబడులు సాధించేందుకు ఈ సేంద్రియ ఎరువులు ఎంతగానో దోహదపడుతాయి.

***ఉపయోగాలు..***

జనుము, పెసర, మినుము, జీలుగ వంటి పంటలను పచ్చిరొట్ట ఎరువులుగా సాగు చేసుకొవడంతో భూమిలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది. పచ్చిరొట్ట ఎరువులతో 15-20శాతం రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చు. మోతాదు తగ్గడం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుంది. వాతవరణ కాలుష్యం, చీడ పీడల ఉధృతి తగ్గుతుంది. సేంద్రియ కర్బనం మొక్కలకు అందడంతో పంట నాణ్యత మెరుగుపడుతుంది. పంటకు 25-30 కిలోల యూరియా వేస్తే ఎంత ఫలితం ఉంటుందో పచ్చిరొట్ట వల్ల అలాంటి ఫలితం వస్తుంది. చౌడు భూముల్లో సాగు చేస్తే చౌడు ప్రభావం తగ్గే ఆస్కారం ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువులను రెండు పద్ధతుల్లో సాగు చేసుకోవచ్చు. మొదటిది రైతులు నేరుగా తమ పొలాల్లో విత్తనాలు చల్లుకుని సాగు చేయడం. రెండోది ఎక్కడైనా చెరువు కట్టలపై, బీడు భూముల్లో సాగు చేసి వాటి కొమ్మలను పొలాల్లో కలియదున్నుకొవాలి.

### రైతులు పచ్చిరొట్ట ఎరువులతో భూసారం



రైతులు రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారం పెంచుకొని అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులకు అధిక దిగుబడులు సాధించాలని, భూసారాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో 60 శాతం సబ్సిడీతో ఈ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందిస్తున్నది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విత్తనాలు మండలాల్లోని సహకార సంఘాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి.

**- కురుమయ్య, ఏవో, వనపర్తి మండలం**

***60శాతం రాయితీతో..***

జిల్లాలో సింగిల్ విండ్‌ల ద్వారా రైతులకు సబ్సిడీ కింద జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం 60శాతం సబ్సిడీద్వారా జీలుగ, జనుము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాయి. జీలుగ విత్తనాల్లో 30 కిలోల బస్తాపూర్తి ధర రూ.2,790 కాగా సబ్సిడీ రూ.1,674 పోగా రైతులు రూ.1,116లు చెల్లించాలన్నారు. అలాగే జనుము విత్తనాలకోసం 40కిలోలబస్తా పూర్తి ధర రూ.3,620 కాగా సబ్సిడీకింద రూ.2,172 పోనూ రూ.1448.80 చెల్లించాల్సి ఉంటుంది.

# కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన ఉండాలి

- వనపర్తి ఎస్పీ రక్షితా మూర్తి



కొత్త చట్టాలపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న అధికారులు

వనపర్తి టౌన్, మే 26 : దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా రూపొందించిన చట్టలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రక్షితా మూర్తి జిల్లా అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతనంగా రూపొందించిన మూడు చట్టాలపై ఆరురోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో నేర న్యాయవ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా మూడు చట్టాలను రూపొందించారన్నారు. అందులో భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్, సురక్ష సంహిత , భారతీయ సాక్ష్యా అదినియం 2023చట్టాలు రానున్నాయని, జులై 1, 2024 నుంచి ఈ చట్టాలు అమలులోకి వస్తాయన్నారు. ఈ చట్టాలపై జిల్లాలోని పోలీస్ సిబ్బందికి ఆరురోజుల పాటు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. హోంవ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం ఈ మూడు చట్టాలు ఐపీసీ 1860 క్రిమినల్ ప్రోసిజర్ కోడ్ (సీఆర్‌పీసీ) 1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 రిప్లేస్ చేయనున్నాయన్నారు. ఈ మూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడం పైనే దృష్టి పెడతాయని, సత్వర న్యాయం అందించడం న్యాయవ్యవస్థ , న్యాయస్థాన నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో అందరికీ న్యాయం అందించడంపై దృష్టి సారించనున్నాయన్నారు. క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికి అవసరాలకు అనుగుణంగా నవీకరించబడ్డాయన్నారు. సవరించిన చట్టాలను అమల్లోకి తీసుకురావడం ప్రభుత్వం చేసిన మంచి ప్రారంభమని అన్నారు. కొత్త చట్టాలలో పేర్కొన్న కమ్యూనిటీ సర్వీస్ శిక్షలు మనకు ఇంతకుముందు పూర్తిగా తెలియనివి అని, కొత్త చట్టాల వర్తింపు , దానికి సంబంధించిన కేసులతో వ్యవహరిస్తున్నప్పుడు వాటిని ఎలా గ్రహించాలనే దానిపై పోలీస్ శాఖకు చెందిన డీఎస్పీ నుంచి కానిస్టేబుల్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. అవగాహన శిక్షణను ఎస్సై వెంకటస్వామి, ఏఎస్సై భాషా ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు. ఈ శిక్షణలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిరుతల సంచారం

***భయాందోళనలో రైతన్నలు, ప్రజలు***

పెద్దమందడి, మే 26 : మండలంలోని ఆయా గ్రామాల్లో చిరుతల సంచరిస్తుండడంతో గ్రామాల్లోని ప్రజలు , రైతన్నలు భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని జంగమాయిపల్లి, బలిజపల్లి, పామిరెడ్డిపల్లి, ఎర్రగట్టుతండా గ్రామాల్లో పొలాలకు వెళ్లాలంటే చిరుతల భయం రైతులకు ఆందోళన కలిగిస్తుంది. కొద్ది రోజులుగా ఈ గ్రామాల శివారులోని అడవి ప్రాంతం లో చిరుతలు ఉన్నట్లు రైతులు చెప్పుకుంటున్నారు. ఇటీవల ఎర్రగట్టు తండా సమీపంలోని ఒక ఆవుదూడను చిరుత తిన్నట్లు అనుమానిస్తున్నారు. అదేవిధంగా నాలుగు రోజుల కిందట కర్నె తండా నుంచి బలిజపల్లికి వ స్తుండగా ఒక ఆర్‌ఎంపీ డాక్టర్‌కి రోడ్డుపై చిరుత కనిపించిందని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. దీంతో గుట్టల ప్రాంతంలో పొలాలు ఉన్న రైతులు వర్షకాలం మొదలవుతుండడంతో పునాస పంటలు వేయా ల వద్దా అని ఆందోళన చెందుతున్నారు. పునాస పంటలు సాగుచేస్తే రాత్రివేళ పొలాల దగ్గరకు వెళ్లాల్సి వస్తుంది. అడవి పందుల బారి నుంచి పంటలు కాపాడుకోవాలని పొలాల దగ్గరకు వెళ్తే చిరుతల భయం నెలకొన్నది. రోహిణి కార్తెలో తుకాలు పోయాలన్న రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తూకాలు పోసి ఇంటి దగ్గర ఉంటే అడవి పందుల బెడద ఉంటుందని వాపోతున్నారు. గ్రామాల్లో ప్రతి రోజూ రైతులు చిరుత చర్చనే కొనసాగుతున్నది. ఫారెస్ట్ అదికారులు వెంటనే స్పందించి చిరుతల కోసం బోనులు ఏర్పాటు చేసి వాటిని పట్టుకొని పులుల సంరక్షణ కేంద్రాలకు తరలించాలని రైతులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాల దోపిడీ

- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు వసూళ్లు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- అధికారులు స్పందించాలని వేడుకోలు

గట్టు, మే 26 : పాఠశాలు, కళాశాలలు త్వరలో తెరచుకోనున్న క్రమంలో విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం కానున్నాయి. ఈ అవసరాలను గట్టుతో పాటు అన్ని గ్రామాల్లోని మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. అందినకాడికి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇదేమని అడిగితే ఇంతేనని సమాధానమిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కాగా మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులు ఒక్కో పనికి ఒక్కో విధంగా రేటు వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దరఖాస్తు ఫారాల్లో అధికారుల సంతకాలు దరఖాస్తుదారుడే పెట్టిస్తే రూ.150, కేంద్రాల నిర్వాహకులు పెట్టిస్తే రూ.300, ధ్రువీకరణ పత్రం ఒక్కో రోజులో చేతికి అందాలంటే రూ.1000 దాకా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అయితే వసూళ్లపై ప్రశ్నిస్తే అధికారులు మాకు ఊరికే పని చేస్తారా? పైసా లేనిదే వాళ్లు ఫైళ్లు కదిలిస్తారా? అంటూ మీ సేవ, ఆన్‌లైన్ నిర్వాహకులు సూటిగా సమాధానమిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. కాగా మీ సేవ, ఆన్‌లైన్ కేంద్రాల నిర్వాహకులపై ఆజమాయిషీ లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలంటున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి ధ్రువీకరణ పత్రాలకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రేటును నిర్వాహకులు తీసుకునే విధంగా చర్యలు తీసుకుని తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## అభివృద్ధే ధ్యేయంగా పోరాడుదాం

అయిజ, మే 26 : అయిజ మండల, పట్టణాభివృద్ధే ధ్యేయంగా ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాయిచూర్ రోడ్డులోని రెడ్డిఫంక్షన్‌హాల్‌లో అఖిలపక్ష కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా అయిజ రెవెన్యూ డివిజ న్, డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, పెద్దవాగుపై హైలెవల్ వంతెన, పులికల్ బీటీ రోడ్డు వంటి పనులు పూర్తి చేయించడంలో అఖిలపక్ష కమిటీ ముందుండి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అయిజ రెవెన్యూ డివిజన్ చేసేందుకు అన్నిరకాల అర్హతలు ఉన్నాయని, ఆ దిశగా ప్రభుత్వం, అ ధికారులపై ఒత్తిడి పెంచేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధంచేసి పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అఖిలపక్ష కమిటీ ఒత్తిడితో హైలెవల్ వంతెన పనులు సాగుతున్నాయని, పనుల్లో వేగం పెంచేందుకు అధికారులపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు కృషి చేద్దామన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తే అయిజ, మల్దకల్, గట్టు, వడ్డేపల్లి, రాజోళి మండలాలకు అనువుగా ఉంటుందన్నారు. పార్టీలకు అతీతంగా అయిజ అభివృద్ధికి కలిసి నడవాలని కోరారు. కార్యక్రమంలో అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం

- నేలకొరిగిన వృక్షాలు



దుప్పల్లిలో జేసీబీతో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

మదనాపురం, మే 26 : గాలివాన బీభత్సానికి వృక్షాలు నేలకొరిగిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి మం డలంలోని దుప్పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నీలగిరి వృక్షాలు విద్యుత్ తీగలపడి నెలకొరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. గ్రామస్తులు సకాలంలో స్పందించి జేసీబీ సాయంతో చెట్లను తొలగించారు. ఈ సమయంలో మండలంలో రెండుగంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

### పెబ్బేరులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పెబ్బేరు, మే 26 : పెబ్బేరు పట్టణంలో ఆదివారం వీచిన గాలికి ఓ హైమాస్ట్ విద్యుత్ స్తంభం నేలకొరిగి విద్యుత్ వైర్ల మీద పడటంతో పెను ప్రమాదం తప్పింది. పదో వార్డులో నిత్యం ప్రజలు తిరుగాడే రోడ్డుపై ఉన్న ఈ స్తంభం దెబ్బ తినడంవల్ల చిన్నపాటి గాలికే రోడ్డు మధ్యలోకి ఒరిగిపోతూ, మిగితా వైర్లపై పడి నిలిచిపోయింది. నేరుగా నేలను తాకి ఉంటే జనాలపై పడేది. దీంతో వైర్లు తెగిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

### ఇంటిపై కూలిన వేపచెట్టు

గట్టు, మే 26 : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ గాలులు వీచాయి. చెట్లు ఊగిపోయాయి. దీంతో ప్రజలు కొంత భయాందోళనలకు గురయ్యారు. గాలులకుతోడు ఓ మోస్తరు వర్షం కూడా కురిసింది. ఇదిలా ఉండగా గట్టులో కావలి మునెప్ప ఇంటి సమీపంలో ఉన్న వేపచెట్టు కూలి ఇంటిపై పడింది. కాగా తృ టితో మునెప్ప ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

### ఈదురు గాలులతో కూడిన జల్లులు

అయిజ, మే 26 : అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన జల్లులు కురిశాయి. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ అంతరాయం కలిగింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో అక్కడక్కడ చెట్లు నేల కూలాయి. చెట్ల సమీపంలోనే విద్యుత్ తీగలు ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గత రెండు రోజుల క్రితం వీచిన గాలులకు విద్యుత్ స్తంభాలు కూలడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తిరిగి అదేస్థాయి గాలులు వీయడంతో విద్యుత్ సరఫరా ఎక్కడ నిలిచిపోతుందోనని ప్రజలు వాపోతున్నారు.



పెబ్బేరులో ఒరిగిన హైమాస్ట్ లైట్ స్తంభం



గట్టులో మునెప్ప ఇంటిపై కూలిన వేపచెట్టు

## స్వామివారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్



అదనపుకలెక్టర్‌ను శేషవస్త్రంతో సన్మానిస్తున్న ఈవో

మల్దకల్, మే 26 : ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని ఆదివారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్ రావు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆయన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఈవో స్వామి వారి శేషవస్త్రంతో అదనపు కలెక్టర్ సన్మానించి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు రవిచారి, చంద్రశేఖర్ రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు కుట్టుమిషన్లు

ధరూరు, మే 26 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టడానికి మహిళా సంఘాల వారికి ఆదివారం కుట్టు మిషన్లను సీసీ శేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మండలంలోని పెద్దపాడులో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సెర్ప్ మహిళాశక్తి సంఘాల సభ్యులకు కుట్టుమిషన్లు అందజేశారు. మహిళలు స్వయంశక్తులుగా ఎదగడానికి ప్రభుత్వం సాయమందిస్తుందని తెలిపారు.

## రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శికి సన్మానం



వెంకటరమణను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కొత్తకోట,మే 26 : వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కొత్తకోట పట్టణానికి చెందిన విశ్వనాథం వెంకటరమణ జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆయనను మాజీ వైస్ ఎంపీపీ గుంతమల్లేశ్, ఐటీఐ చైర్మన్ గంగాధర్, డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి, భీమా భాస్కర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహగౌడ్ బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

గట్టు, మే 26 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన మాచర్లలో ఆదివారం చోటుచేసుకున్నది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మాచర్లలో మాటువేశారు. ఓ ఆటో అటువైపు నుంచి వస్తుండగా తనిఖీ చేయగా దాంట్లో రేషన్ బియ్యం 53బస్తాలు(50కేజీలవి) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆటోలో ఉన్న మల్లికార్జున్, ఎరుకలి రమేశ్, ఎరుకలి నర్సింహులును విచారణ చేయగా తాము రాయిచూర్‌కు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు చెప్పారని పోలీసులు వెల్లడించారు. వాహనాన్ని పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ వెంకటేశ్ తెలిపారు.

## విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

గట్టు, మే 26 : గట్టు బస్టాండ్ ఆవరణలో ఈనెల 30వ తేదీన అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు మారెన్న తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విగ్రహావిష్కరణ మహోత్సవ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ కాశీం ముఖ్య అతిథిగా వస్తున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలి

- ఎంవీఐ కమల్‌కాంత్

గద్వాల అర్బన్, మే 26 : వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వాహనంలోనే ఉంచుకోవాలని వాహనదారులకు మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ కమల్‌కాంత్ పేర్కొన్నారు. గద్వాల-రాయిచూర్ వెళ్లే మార్గంలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో భాగంగా ట్యాక్స్, ఇన్సూరెన్స్ పత్రాలు లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎంవీఐ కమల్‌కాంత్ మాట్లాడుతూ వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉంటేనే రోడ్డుపైకి రావాలని, సరైన ధ్రువీకరణ పత్రా లు లేకుండా వాహనం రోడ్డు ఎక్కితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించకూడదని, పరిమితికి మించి అధికలోడ్‌తో వాహనం వెళ్లకుడదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఖాదర్ ఉన్నారు.

## సామాజిక సేవకు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న సురేశ్‌శెట్టి

వనపర్తి టౌన్/అలంపూర్, మే 26 : వనపర్తి జిల్లాకు చెందిన వాసవి సేవా సమితి జాతీయ అధ్యక్షుడు, సామాజిక సేవకుడు పూరి సురేశ్‌శెట్టికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ అవార్డును ప్రదానం చేశారు. సామాజిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నందుకు ఈ అవార్డును శనివారం ప్రదానం చేశారు. తమిళనాడులోని హోతూర్‌లో విజయ అకాడమీ ఫౌండర్ విజయన్, ఇండియా ఆఫ్రికా ట్రేడ్ కౌన్సిల్ డాక్టర్ పి.రాధాకృష్ణన్, హ్యూమెన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్, రవిచంద్రన్ చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని పూరి సురేశ్ శెట్టి ఆనందం వ్యక్తం చేశారు.